క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలంలోని పండితాపురానికి చెందిన బోడ అచ్చాలు ఇటీవల అకాల మరణం చెందటంతో బుధవారం ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ సత్ కీర్తి రూ.2లక్షల ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం కింద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జయప్రకాశ్, సిబ్బంది వరుణ్ భార్గవ్, బ్యాంకు మిత్ర ఉమారాణి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కావ్యచంద్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

ఖమ్మం వైద్యవిభాగం: కావ్య ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కావ్యచంద్‌కు డయాబెటిస్, లివర్ సమస్యలపై చేసిన పరిశోధనలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. మొట్టమొదటిసారిగా ఖమ్మం నుంచి ఆమెకు స్థానం దక్కడం విశేషం. ఈమేరకు మేనేజ్‌మెంట్ రవీందర్, ప్రసూన, సిబ్బంది పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేట్ కళాశాలలో విచారణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఇటీవల కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యుడు బృందాదర్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాలలో పరిశీలించడమే చికిత్స పొందుతున్న విద్యార్థినితో మాట్లాడారు. అధికారులు విష్ణువందన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కామేపల్లి (కారేపల్లి): మండల పరిధిలోని నెమలిపురి గ్రామంలో దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన సోదరుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రథమ బహుమతిగా రూ.12,016 నగదుతో పాటు షీల్డు, ద్వితీయ బహుమతిగా షీల్డుతో పాటు రూ.8,016లు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాణోతు వెంకటప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథరెడ్డి, స్థానిక సర్పంచ్ విజయ మోహన్, సురేష్, పరిస్యా తదితరులు పాల్గొన్నారు.

'వేదామృతం'పై రాద్ధాంతం సరికాదు

నేలకొండపల్లి: ప్రకృతి పానీయమైన నీరాకు వేదామృతం అని పేరు పెడితే ఎందుకీ రాద్ధాంతం చేస్తున్నారని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు కాసాని నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటి, ఈత చెట్ల నుంచి తీసే స్వచ్ఛమైన పానీయాన్ని సీసాలు, ప్యాకెట్లలో విక్రయించే కేంద్రానికి వేదామృతం అని పేరు పెట్టిందని అన్నారు. దేవుళ్ల పేరుతో లిక్కర్ షాపులు, హోటళ్లు, లాడ్జీలు, క్లబ్‌లు, మాంసం, చికెన్ దుకాణాలు ఉన్నాయని అన్నారు. వాటిపై లేని అభ్యంతరం దీనిపై ఎందుకన్నారు. కల్లు, నీరా ఆయుర్వేదానికి చెందినవనే వాస్తవాన్ని బ్రాహ్మణ సంఘాలు గుర్తుంచుకోవాలని సూచించారు.

రూ.4.05 లక్షలకు గుంటు మల్లన్న భూమి లీజ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయ భూమిని మూడేళ్ల పాటు లీజ్‌కు ఇచ్చారు. ఆలయానికి ఖమ్మం మార్కెట్ పక్కన సుందరయ్యనగర్‌లో 4.19 ఎకరాల భూమి ఉండగా, కొందరు కబ్జాకు యత్నిస్తుండడంతో రక్షించుకునేందుకు లీజ్‌కు దేవాదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించగా, నలుగురు పోటీ పడ్డారు. ఇందులో ఏటా రూ.1.35లక్షల చొప్పున రూ.4.05లక్షలు చెల్లించేలా వ్యాపారి కె.సదాశివరావుకు లీజ్ ఖరారైంది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుండు లక్ష్మీనారాయణ, ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రరావు, సభ్యులు కేశగాని రవి, మరాటి యాదయ్య, కాటం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సెలవులు 'ప్రైవేట్'లోనూ అమలు చేయాలి

నేలకొండపల్లి: ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంత్రి సెలవులు అన్ని ప్రైవేట్ పాఠశాలలో కూడా అమలు చేయాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం పాలేరు డివిజన్ అధ్యక్షుడు బి.సాగర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 నుంచి 17 వరకు ప్రకటించిన సెలవులను అమలు పరిచేలా విద్యాశాఖ అధి కారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	వీరసింహారెడ్డి
వినోద	వీరసింహారెడ్డి
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	వీరసింహారెడ్డి
శ్రీనివాస	ధమాకా
సుందర్	వీరసింహారెడ్డి

- ఖమ్మంవ్యవసాయం

పాత బస్టాండ్‌కు కొత్త శోభ

- సిటీ బస్టాండ్‌గా పునరుద్ధరించడంతో ముస్తాబవుతున్న వైనం
- బస్టాండ్ సమీప వ్యాపారులకు దక్కనున్న పూర్వవైభవం
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి పువ్వాడ



ముస్తాబవుతున్న సిటీ బస్టాండ్



బస్టాండ్ బయట తెరుచుకున్న షాపులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఆర్టీసీ పాత బస్టాండ్‌ను మళ్లీ సిటీ బస్టాండ్‌గా పునరుద్ధరించడంతో కొత్త సొబగులు సంతరించుకుంటున్నాయి. గత రెండేళ్లుగా నిలిచిపోయిన బస్టాండ్ అన్ని హంగులతో తీర్చిదిద్దుతూ ఆర్టీసీ అధికారులు ముస్తాబు చేస్తున్నారు. పాడైన విద్యుత్ కనెక్షన్ల స్థానంలో కొత్త కనెక్షన్లు చేయడంతో పాటు గోడలకు, ప్లాట్ ఫాంలకు రంగులు వేస్తున్నారు. ప్రాంగణంలోని గుంతలు చదును చేస్తూ పూర్వవైభవం తీసుకొచ్చేలా ఇక్కడ పనులు జరుగుతున్నాయి.

సిటీ సర్వీసులతో పాటు పల్లె వెలుగులు..

ఈ సిటీ బస్టాండ్‌లో సిటీ సర్వీసులతో పాటు పల్లె వెలుగు బస్సులు నడపటానికి అధికారులు యోచిస్తున్నారు. కాల్వొడ్డు, వైరా రోడ్, జెడ్పీసెంటర్, కలెక్టరేట్, ఇల్లెందు క్రాస్‌రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్ వరకు సిటీ సర్వీసులు నడుపుతున్నారు. అలాగే, కొత్త బస్టాండ్ నుంచి కాల్వొడ్డు వరకు సర్వీసులు 10 మినీ బస్సులు అందుబాటులో ఉండనున్నాయి.

ఊపందుకుంటున్న వ్యాపారాలు..

ఇప్పటి వరకు నిలిచిపోయిన బస్టాండ్ వల్ల స్థానికంగా వ్యాపారాలు తగ్గిపోయాయి. మళ్లీ బస్టాండ్‌కు పూర్వవైభవం రావటంతో ఇక్కడ వ్యాపారాలు మళ్లీ ఊపందుకుంటున్నాయి. అలాగే, బస్టాండ్ కాంప్లెక్స్‌లోని షాపులతో పాటు బస్టాండ్ ప్రాంగణంలో గతంలో తీసివేసిన షాపులు మళ్లీ తెరవటంతో వ్యాపారం కూడా పెరిగినట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు.

నేడు లాంఛనంగా ప్రారంభం..

ప్రజల సౌకర్యార్థం పాత బస్టాండ్‌ను సిటీ బస్టాండ్‌గా పునరుద్ధరించి మళ్లీ అందుబాటులోకి తెచ్చిన రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం సిటీ బస్టాండ్‌ను గురువారం ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యాపారాలు పెరిగాయి..



గత రెండేళ్లుగా నిలిచిపోయిన మా వ్యాపారాలు పాత బస్టాండ్ పునరుద్ధరించడం వల్ల మళ్లీ మా వ్యాపారాలు ఊపందుకుని పూర్వవైభవం తెచ్చింది. గతంలో మా వ్యాపారం ఎలా సాగిందో ఇప్పుడు కూడా అలాగే సాగుతోంది. ఇది మంచి పరిణామం.

- రవి, మెడికల్ షాప్

మంత్రికి కృతజ్ఞతలు..



పాత బస్టాండ్‌ను మళ్లీ అందుబాటులో తెచ్చిన మంత్రి అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు. ఇప్పటి వరకు వ్యాపారం సరిగాలేక ఇబ్బంది పడ్డాం. ఈ బస్టాండ్ తెరవటం వల్ల మాకు వ్యాపారం మరింత పెరిగే అవకాశం ఉంది.

- శ్రీనివాస్, అరటికాయల వ్యాపారి

బహిరంగ సభకు భారీగా తరలిరావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు పాలేరు నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, ఇన్‌చార్జిలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలాల వారీగా సమీక్షలు నిర్వహించి సభకు తరలించే జనం, రవాణా తదితర అంశాలపై చర్చించారు.పాలేరు నుంచి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరాహార దీక్ష



మాట్లాడుతున్న డాక్టర్ కేవీ కృష్ణారావు

ఖమ్మం లీగల్/ఖమ్మంమామిళ్లగూడెం: దళిత న్యాయవాద దంపతులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కోరుతూ న్యాయవాదులు సోమవారం నుంచి చేస్తున్న నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా న్యాయవాదులు కోర్టు ముందు చేస్తున్న నిరసనకు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. న్యాయవాద కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, ఖమ్మం జైభీమ్ న్యాయవాదుల అధ్యక్షుడు కర్లపూడి శ్రీనివాసరావు, వివిధ కుల సంఘాల నాయకులు బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వంచ రామారావు, డాక్టర్ గోపీనాథ్, వీరభద్రం, ఎండీ అసద్, వై.శ్రీనివాసరావు, బిచ్చాల తిరుమలరావు, గద్దల దిలీప్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కర్లపుడి శ్రీనివాస్‌తో పాటు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

వినతుల పర్వం..

మంత్రికి..

ఖమ్మంమయూరిసెంటర్: విదేశీ వర్సిటీలు దేశంలో పెట్టుకోవడానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) ఇచ్చిన అనుమతులను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు ఖమ్మం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంత్రి అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె. సుభాని, ఉపాధ్యక్షులు ధర్మవరపు యువరాజ్, సందీప్, సతీష్, నవీన్ పాల్గొన్నారు.

డీఈఓకు..

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి ప్రశ్నాపత్రంలో 33శాతం అంతర్గత చాయిస్ ప్రశ్నలతో పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డీఈఓ సోమశేఖర శర్మకు బుధవారం విన్నవించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల్లో చాయిస్ ఉండేలా రోజు విడిచి రోజు పరీక్షలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వల్లముడి సతీష్, కరుణ్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బీఎస్ఎన్ఎల్ ఏజీఎం అడ్మిన్‌కు..

ఖమ్మంమయూరిసెంటర్: బీఎస్ఎన్ఎల్‌లో పని చేసిన ఉద్యోగుల మెడికల్ బిల్లులు చెల్లించడంలో మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్ వీరస్వామి, ఖమ్మం జిల్లా కార్యదర్శి తిర్మల్‌రావు అన్నారు. బుధవారం ఖమ్మంలోని బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయం ఎదుట పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఏజీఎం అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ పెన్షనర్ల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల 65 ఏళ్ల పైబడిన వారు పోరాటాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్‌ఈయూ జిల్లా కార్యదర్శి సీహెచ్. శ్రీనివాసరావు, అసోసియేషన్ నాయకులు ఎస్.ఉపేందర్, టి.శంకర్‌రావు, కె.రాజేంద్రప్రసాద్, ఎస్.పాపయ్య, వెంకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ వజ్జా రమ్య

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ, సీడీపీఓ బాలా త్రిపుర సుందరీ, ఈజీఎస్ ఏపీఓ సునీత, బోదులబండ, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్‌టీపీ ఖమ్మం నగర మహిళా అధ్యక్షురాలిగా కొర్లపాటి నీలవేణి నియమితులైంది. ఈమేరకు బుధవారం ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అందించిన నియామక పత్రాలను ఖమ్మంలోని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్ తన కార్యాలయంలో ఆమెకు అందజేశారు. మహిళ కమిటీ ఉపాధ్యక్షులుగా వనపర్ల అరుణ, కొమ్మినేని హైమావతి, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్.చంద్రకళ, గూడూరి శేషమ్మ, కుంచపర్తి మౌనిక, మరసకట్ల శ్వేత ప్రశాంతి, కొర్లపాటి అనూష, కొనకన్ల పద్మావతి, దుంపల కల్యాణి ఎంపికయ్యారు.

జిల్లా రియల్టర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'కాటేపల్లి'..

ఖమ్మంఅర్బన్: జిల్లా రియల్టర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగరంలోని బల్లేపల్లికి చెందిన కాటేపల్లి జనార్దన్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం జిల్లా కమిటీ నుంచి లేఖ అందినట్లు జనార్దన్ తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా ఇద్దరు



సాంబశివరావు

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గంలోకి జిల్లాకు చెందిన ఇద్దరు జర్నలిస్టులకు చోటు దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఐజేయూ సభలో ఖమ్మంకు చెందిన వెన్నబోయిన సాంబశివరావు, తల్లాడకు చెందిన దుక్కిదేవర అజయ్‌కుమార్‌ను నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి హర్షం వ్యక్తం చేశారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన ఎంపీడీఓ



వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమయపాలన పాటించకుండా పాఠకులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారిపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సాక్షి'లో గందరగోళంగా గ్రంథాలయం అనే కథనం ప్రచురించిన విషయం విధితమే. స్పందించిన ఎంపీడీఓ బుధవారం గ్రంథాలయాన్ని సందర్శించి గ్రంథాలయ అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పాఠకులతో మాట్లాడారు. పాఠకులకు అసౌకర్యం కలగకుండా.. సమయపాలన తప్పకుండా పాటించాలని ఆదేశించారు. మరోమారు ఇలా జరిగితే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పువ్వాడ, ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 18న జరగనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఖమ్మం వచ్చిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఖమ్మంలోని వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చిన హరీశ్‌రావును వారు సత్కరించారు. ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతోపాటు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ సెంటర్ కాదు.. కేఎంసీ !



ఇక్కడ కార్ కడుగున్న వ్యక్తి చూశారు కదా! చూడగానే ఇదేదో సర్వీస్ సెంటర్‌లోని దృశ్యమనే ఆలోచన వచ్చిందా.. కానీ కాదు!! జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో తీసిన ఫొటో ఇది. కేఎంసీ మున్సిపల్ ఇంజనీర్(ఎంఈ)కు చెందిన కారును ఆయన డ్రైవర్ కేఎంసీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఇలా కడిగేశాడు. మొక్కలకు నీళ్లు పట్టే పైప్ ఊడదీసి మరీ కారును కడగడం గమనార్హం. ఇదేమిటని అడిగితే... నన్నెవరూ ఏమీ చేయలేరంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం.

- ఖమ్మం మయూరిసెంటర్

వైభవంగా కూడార్తై ఉత్సవం



ఖమ్మంఅర్బన్: టేకులపల్లి గోశాలలో భక్తుల పూజలు

మండల కేంద్రంలోని పలు దేవాలయాల్లో బుధవారం కూడార్తై ఉత్సవాల్లో భాగంగా గోదాకల్యాణం నిర్వహించి స్వామి వారికి 108 పాత్రల్లో నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామునుంచే భక్తులు దేవాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- నేలకొండపల్లి/ఖమ్మంఅర్బన్

వైఎస్సార్‌టీపీ ఆర్థిక సాయం



ఖమ్మంరూరల్: ఆర్థిక సాయమందిస్తున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, గాయాలపాలైన పలు కుటుంబాలకు వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పీఏ రవీందర్‌రెడ్డి బుధవారం ఆర్థిక సాయమందించారు. రెండు మండలాల్లో 12 కుటుంబాల వారికి రూ.25వేలు చొప్పున, మరో నలుగురి కుటుంబాలకు రూ.5వేలు చొప్పున, ఇళ్లు దగ్ధమైన మరొకరికి మరో రూ.5వేలు అందించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆలస్యం రవి, వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షులు ఎండపల్లి వెంకయ్య, వాలూరి సత్యనారాయణ, గుగులోత్ రూప్లానాయక్, కార్యదర్శి బత్తిని యాలాద్రి, డివిజన్ అధికార ప్రతినిధి సైదులు, నాయకులు మండడి వెంకటరెడ్డి, శ్యామల రాంరెడ్డి, ఉపేందర్, వెంకన్న, సింగిరెడ్డి, రాంరెడ్డి, స్వరూపరాణి, తోట భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే సతీమణి..

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పర్యటించి 33 కుటుంబాలను పరామర్శించి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నీకి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: రాజస్థాన్‌లో జరుగుతున్న 44వ జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ టోర్నీకి ఖమ్మంకు చెందిన నందిని, మీనాక్షి ఎంపికయ్యారు. అలాగే, రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఖమ్మం వాసి వరికురి మోహన్ వ్యవహరించనున్నారు. వీరిని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.రఘునందన్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి అభినందించారు.

ఫొటోగ్రాఫర్‌కు బంగారు పతకం

ఖమ్మంమయూరిసెంటర్: నగరానికి చెందిన ఫొటోగ్రాఫర్ తగరం సందీప్‌కుమార్ జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఒడిశాలో ఇటీవల జరిగిన హుస్సేన్ ఖాన్ 5వ నేషనల్ జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన స్పాట్ ఫొటో కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఈసందర్భంగా ఆయనను పలువురు ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

కేరళ ప్రదర్శనకు 'త్రివేణి' విద్యార్థిని

ఖమ్మం సహకారనగర్: నిర్మల్ జిల్లా కొండాపూర్‌లో టెక్నాలజీ అండ్ టాయ్స్ అనే అంశాలకు సంబంధించి రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించిన ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థి స్మార్ట్ హెల్మెట్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌లు తెలిపారు. కాగా, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి పొంది కేరళలో జరిగే దక్షిణ భారతస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి- త్రివేణి డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల ఇంచార్జీలు పాల్గొన్నారు.

సొసైటీ బలోపేతానికి కృషి

నేలకొండపల్లి: సొసైటీల బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు బోదులబండ పీఏసీఎస్ చైర్మన్ అనంతు కాశయ్య తెలిపారు. బుధవారం సొసైటీ పరిధిలోని ఇటీవల మృతిచెందిన సభ్యుల కుటుంబాలకు సొసైటీ కార్యాలయంలో బీమా చెక్కులను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోనే సొసైటీని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపేందుకు సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం సహకార సంఘాలను పటిష్టం చేసేందుకు ఇటీవల చైర్మన్లకు గౌరవ వేతనం, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నాగేశ్వరరావు, డైరెక్టర్ తాటికొండ నాగేశ్వరరావు, రైతులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారకులను శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేస్తుండగా వివాహిత మాధవి మృతి చెందిన ఘటనలో బాధ్యులను గుర్తించి శిక్షించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రి వద్ద బుధవారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. నాయకులు రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్, అంజయ్య, ఉపేందర్‌గౌడ్, రామ్మోహనరెడ్డి, పాపారావు, ప్రసాద్, దొంగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: నగరంలోని గట్టయ్య సెంటర్‌లోని జీవన సంధ్యా వృద్ధాశ్రమాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు తమకు వృద్ధాప్య పెన్షన్ రావడం లేదని అడుగగా, ఓటర్ గుర్తింపు కార్డు కావాలని సూచించిరు. వృద్ధులు ఎవరైనా తమ పిల్లల నుంచి పోషణ కోరినట్లయితే న్యాయ సేవా సంస్థ ద్వారా తగు చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి వివరించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



న్యూ ఇరా పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

నగరంలోని శ్రీచైతన్య, న్యూఇరా పాఠశాలల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంబరాలు జరుపుకున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేసేలా విద్యార్థులు వివిధ వేషధారణల్లో అందరినీ ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- ఖమ్మం సహకారనగర్